క్లుప్తంగా

సుబ్రమణ్యంకు డాక్టరేట్



అవార్డు తీసుకున్న సుబ్రమణ్యం

చిత్తూరు కార్పొరేషన్: వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగి, క్లాస్–4 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యంకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆదివారం ఢిల్లీలో ఎంబీఆర్ యూనివర్సిటీ తరఫున దేశవ్యాప్తంగా పలు రంగాల్లో సేవలు అందించిన 29 మందికి డాక్టరేట్‌లు అందజేశారు. ఆంధ్ర రాష్ట్ర పరంగా సామాజికసేవ, యూనియన్ లీడర్‌షిప్ కేటగిరిలో సుబ్రమణ్యంకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాటియా ఇచ్చారు. పలు రంగాల్లో ప్రతిభ చూపిన వారికి వీటిని అందజేస్తున్నామని కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ గణగళ్ల అన్నారు. అవార్డు రావడం బాధ్యతను మరింత పెంచిందని కష్టానికి గుర్తింపు ఇవ్వడం ఆనందంగా ఉందని సుబ్రమణ్యం తెలిపారు.

అన్నదానానికి విరాళం

కాణిపాకం: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలోని అన్నదానం ట్రస్టుకు శనివారం ఓ దాత విరాళం అందజేశారు. పూతలపట్టు కమ్మగుట్టపల్లికి చెందిన సాంబశివనాయుడు రూ.1,08,000 చెక్కును అధికారులకు అందజేశారు. ఎమ్మెల్యే మురళీమోహన్, ఏఈఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ మంజుల

ఐరాల: పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ ఐరాల సెక్టార్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం నాగంవాండ్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మన పెరట్లో పెంచుకునే తాజా కూరగాయలే పౌష్టికాహారం అన్నారు. కూరగాయలు, ఆకుకూరల్లో సూక్ష్మ పోషకాలైన విటమిన్లు, ఖనిజాలు ఉంటాయని తెలిపారు. పౌష్టికాహారంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్త భూలక్ష్మి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి



మాట్లాడుతున్న పుష్ప

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో క్రిష్ణజమ్మపురం యూనిట్‌లోని గ్రామ సంఘ అధ్యక్షులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పుష్ప మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చెరకు సాగుచేసి అందులో వస్తున్న బెల్లాన్ని టీటీడీ తీసుకోవడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. సంఘ సభ్యులు కిచెన్ గార్డెన్‌పై వివరించారు. గ్రామ సంఘసభ్యులు పాల్గొన్నారు.

కొత్త కళాశాలలు ప్రారంభించాలి



కొత్త ప్రభుత్వం మెడికల్ కళాశాలలను త్వరగా ప్రారంభించాలి. నీట్ విద్యార్థులకు కొత్త మెడికల్ కాలేజీల్లో సీట్లు వచ్చే అవకాశం ఉంది. నీట్ పరీక్షలు రాసి క్వాలిఫై అయిన చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు వస్తాయని ఆశలు పెట్టుకున్నారు. గత ప్రభుత్వంలో 17 వైద్యకళాశాలలు మంజూరయ్యాయి. వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు ఇవ్వకుండా ప్రభుత్వమే నిర్వహిస్తే నాలాంటి మధ్యతరగతి విద్యార్థులకు మేలు కలుగుతుంది.

- షేక్‌బాబు, నీట్ విద్యార్థి, చిత్తూరు



ప్రైవేటీకరణ వద్దు



ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలనుకోవడం అన్యాయం. నూతన ప్రభుత్వ కళాశాలలతో పేద విద్యార్థులైన నాలాంటి ఎంతో మందికి భవిష్యత్తు బాగుంటుంది. వైద్య విద్యనభ్యసించాలన్న విద్యార్థుల ఆకాంక్షలను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలి. కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రారంభిస్తే అందులో సీటు వస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నా. కొత్త కళాశాలలను రద్దు చేయాలని చూడడం సరికాదు. ప్రభుత్వం పునరాలోచన చేసి మరో నిర్ణయం తీసుకోవాలి.

-రుషి, నీట్ విద్యార్థి, చిత్తూరు

చదువుకునేదెట్లా..?

- పూర్వ ప్రాథమిక విద్యపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- రెండు నెలలైనా అంగన్‌వాడీ కేంద్రాలకు అందని పాఠ్యపుస్తకాలు
- పాత పుస్తకాలతోనే విద్యాబోధన



పాత పుస్తకాలతో విద్యార్థులకు బోధిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త (ఫైల్)

పూతలపట్టు: చదువులకు పునాది అంగన్‌వాడీ కేంద్రాలు. సకల సౌకర్యాల మధ్యన ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటబొమ్మలతో, ఆకట్టుకునే పుస్తకాలతో చిన్నారులకు విద్యనందించాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. రెండు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యనభ్యసిస్తున్న చిన్నారులపై చిన్నచూపు చూస్తోంది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి జూన్ నెలలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకోగా రెండు నెలలు దాటినా అంగన్‌వాడీ కేంద్రాలకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోంది. పూతలపట్టు మండలంలోని 63 అంగన్‌వాడీ కేంద్రాలుండగా అందులో 36 కేంద్రాలు మినీ అంగన్‌వాడీలు ఉన్నాయి. మండలం మొత్తం 560 మంది అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్నారు. యాదమరి మండలంలో 72 అంగన్‌వాడీ కేంద్రాలుండగా అందులో 14 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 805 మంది చదువుతున్నారు. ఐరాల మండలంలో 76 కేంద్రాలుండగా అందులో 682 మంది విద్యార్థులున్నారు. తవణంపల్లి మండలంలో 74 కేంద్రాలు, 736 మంది విద్యార్థులున్నారు. బంగారుపాళ్యం మండలంలో 101 కేంద్రాల్లో 4,290 మంది చదువుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు సరఫరా చేయకపోవడంతో ఆయా కేంద్రాల్లో పాత పుస్తకాలతో బోధన కొనసాగుతోంది. అంగన్‌వాడీలకు పీపీ–1, పీపీ–2 పుస్తకాలు అందకపోవడంతో కార్యకర్తలు పాతపుస్తకాలతో బోధన సరిపెడుతున్నారు. గత ప్రభుత్వం సకాలంలో పాఠ్యపుస్తకాలను సరఫరా చేసింది. ప్రస్తుత ప్రభుత్వం పాఠ్య పుస్తకాలకు అందించకపోవడంతో విద్యాబోధన మొక్కుబడిగా మారింది. కొత్త పుస్తకాలు ఇస్తారో లేదో అన్న సందేహంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకు మొగ్గు చూపుతున్నారు.

అంతంతమాత్రంగానే కూరగాయల బిల్లులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకవైపు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు సరఫరా చేయకపోవడమే కాక మరో వైపు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి కూరగాయల బిల్లులు అంతంత మాత్రంగానే చెల్లిస్తోంది. ఆయా కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు పాలు, ప్రతిరోజూ గుడ్డుతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఒక్కో చిన్నారికి గ్యాస్ బిల్లుతో పాటు కూరగాయలకు సంబంధించి ఒక్కొక్కరికి రూ.2.75 చెల్లిస్తోంది. మార్కెట్‌లో కూరగాయలు ధరలు పెరిగిపోవడంతో ప్రభుత్వం చెల్లించే మొత్తం ఏ మాత్రం సరిపోవడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులను సకాలంలో చెల్లించకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మధ్యాహ్న భోజన పథక నిర్వహణ భారంగా మారింది. ప్రస్తుతం కూరగాయలు, గ్యాస్ రూపంలో ఇచ్చే మొత్తాన్ని రెట్టింపు చేయాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు.

నాడు పీపీ–1, పీపీ–2 కిట్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అన్ని రకాల పుస్తకాలను సరఫరా చేసింది. నాలుగు పుస్తకాలతో కూడిన బర్డ్స్–1, బర్డ్స్–2 కిట్లను అందించింది. వీటితో పాటు అంగన్‌వాడీల్లో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల మాదిరిగా ఇంగ్లిష్‌లో పాఠాలు బోధిస్తుంటే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. బోధనకు సంబంధించి రెండు నుంచి నాలుగేళ్లలోపు చిన్నారులకు ఇంగ్లిష్, గణితం, స్పోకన్ ఇంగ్లిష్, యాక్టివిటీ డ్రాయింగ్స్‌కు సంబంధించి ఐదు పుస్తకాలతో కూడిన పీపీ–1, పీపీ–2 కిట్లను అందించేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పాఠ్యపుస్తకాల పంపిణీ ఊసే లేకుండాపోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పూతలపట్టులోని అంగన్‌వాడీ కేంద్రం

త్వరలో పంపిణీ చేస్తాం

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ఏడాదికి సంబంధించిన కొత్త పాఠ్యపుస్తకాలు ఇంకా రాలేదు. వచ్చిన వెంటనే ఆయా కేంద్రాలకు అందజేస్తాం. జిల్లా వ్యాప్తంగా ఇంకా ఎక్కడా కొత్త పుస్తకాలు అందలేదు. మా వద్ద ఉన్న పాత పుస్తకాలతోనే బోధిస్తున్నాం. ప్రతిరోజూ టైంటేబుల్ ప్రకారం చిన్నారులకు విద్యాబోధన కొనసాగుతుంది.

–నిర్మల, సీడీపీఓ, పూతలపట్టు

ఎక్సైజ్‌లో సెబ్ విలీనంపై అధికారుల హర్షం

చిత్తూరు అర్బన్: ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌లోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై చిత్తూరులో ఆ శాఖ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మిట్టూరులోని ఎక్సైజ్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈఎస్ శ్రీధర్‌రావు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో నూతన కమిషనర్



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

చిత్తూరు అర్బన్: స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులైన పి.నరసింహప్రసాద్ శనివారం కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చారు. బదిలీల్లో భాగంగా పుంగనూరులో పనిచేస్తున్న నరసింహప్రసాద్‌ను ఇటీవల చిత్తూరుకు బదిలీ చేయగా.. విజయవాడ వరద నేపథ్యంలో ఈయనకు సహాయక చర్యల విధులను కేటాయించారు. దీంతో పది రోజులపాటు అక్కడే ఉన్నారు. విజయవాడలో విధులు పూర్తికావడంతో చిత్తూరులో కార్యాలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయ అధికారులు ఉమామహేశ్వరరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆదాము, గోవర్ధన్, అమర్‌నాథ్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



చంద్రకళను సత్కరిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యాభివృద్ధికి అందించిన ఉత్తమ సేవలకుగాను తెలుగు అధ్యాపకురాలు చంద్రకళకు డా.సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ ప్రతిభా పురస్కారం అందజేశారు. తిరుపతిలో యువతేజం ట్రస్ట్, కళాం విజన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేశారు. విద్యార్థుల అభివృద్ధి కోసం పలు సేవా కార్యక్రమాలు చేసిన చిత్తూరుకు చెందిన తెలుగు అధ్యాపకురాలు (వే ఫౌండేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు)కు పురస్కారం, జ్ఞాపికను అందజేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు డా.సుబ్రహ్మణ్యశర్మ చేతుల మీదుగా పురస్కారం అందుకోవడం ఆనందకరమన్నారు. ఈ పురస్కారం తనలో మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. ఆమెను పలువురు అధ్యాపకులు, మిత్రులు అభినందించారు.

దళిత మహిళను కొట్టిన వారిని శిక్షించాలి

పలమనేరు: కర్నూలు జిల్లా కల్లుకుంటలో దళిత మహిళలను కరెంట్ స్తంభానికి అమానవీయంగా కట్టేసి కొట్టిన కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని స్థానిక మానవహక్కుల సంస్థ నిర్వాహకులు డీవీ మునిరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు స్థానిక కార్యాలయంలో కర్నూలు ఘటనపై మాట్లాడుతూ ఓ బీసీ యువతిని ఎస్సీ యువకుడు ప్రేమించాడని కక్షగట్టి యువకుడి తల్లిపై దాడి చేయడం అమానుషమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పేదల ఆరోగ్యమే లక్ష్యం

తవణంపల్లె: పేదలందరికి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు కేశవ నారాయణ, వినయ్‌కుమార్ తెలిపారు. శనివారం కారకాంపల్లె, చారాల గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు 85 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న మెరుగైన వైద్యసేవలు పేదలకు వరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. శనివారం మండలంలోని పేయన్నగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 75 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 143 కేసుల పరిష్కారం

- రూ.97.07 లక్షల విలువైన కేసుల రాజీ



కక్షిదారులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు



జూనియర్ సివిల్ కోర్టులో లోక్‌అదాలత్ జరుగుతున్న దృశ్యం

పలమనేరు: పట్టణంలోని సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో సీనియర్ సివిల్‌జడ్జి శ్రీనివాసరావు, జూనియర్ సివిల్‌జడ్జిలు లిఖిత, రాధమ్మ ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 143 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో సివిల్, క్రిమినల్, బ్యాంకులకు సంబంధించి మొత్తం రూ.97.07 లక్షల విలువైన కేసులను రాజీ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ జడ్జి శ్రీనివాసరావు మాట్లాడతూ కక్షిదారులు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్ ద్వారా సులభంగా కేసులను రాజీ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇరుపార్టీల వారు అనవసర పంతాలకు పోయి సమయాన్ని, నగదును వృథా చేసుకోవద్దని సూచించారు. రాజీమార్గం ద్వారా కక్షిదారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సుప్రీం కోర్టు ఈ విధానాన్ని అమలు చేస్తోందన్నారు. ఇందులో రాజీ పడిన వారు కేసులు గెలిచినట్టేనని తెలిపారు. కేసుల రాజీకి కృషిచేసిన న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు, పోలీసులకు ఆయన అభినందనలు తెలిపారు. ఇందులో వివిధ స్టేషన్ల నుంచి పోలీసులు, సీనియర్ లాయర్లు లక్ష్మీపతి, పరమశివప్ప, భాస్కర్, ఏపీపీ రంజిత్‌షాతో పాటు బార్ అసోషియేషన్ సభ్యులు, పలు బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్ వేడుకలు





హిందీ కవుల వేషధారణలో బృందావన్ విద్యార్థులు, విజయం పాఠశాలలో హిందీ దివస్ వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని సంతపేటలోని బృందావన్ పాఠశాలలో శనివారం హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులోభాగంగా విద్యార్థులు హిందీ కవుల వేషధారణలో విచ్చేసి అందరినీ ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ శైలజ, డైరెక్టర్ ప్రియ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయం పాఠశాలలో..

నగరంలోని విజయం విద్యాసంస్థల్లో హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులోభాగంగా హిందీ భాషపై విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈసందర్భంగా నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజ హెచ్‌ఎం కౌసల్య, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మాండం.. బ్రహ్మోత్సవం



- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. రథోత్సవం ముందు వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తిపరవశంలో మునిగిపోయారు. కోలాటాలు, డప్పువాయిద్యాలు, నయాండి, లంబాడి, చెక్క భజనలు అలరించాయి. అలాగే స్వామివారి ఆస్థాన మండపంలో కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథా గానాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

అన్నదానం...

రథోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. ఇందులోభాగంగా స్థానికులు, దాతలు అన్నదానానికి ముందుకొచ్చారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు.















